# కథ పడింది

## సి.వి. సర్వేశ్వరశర్మ

జోగినాథం ఆనందానికి అంతులేదు. తను రాసిన కథ ప్రచురణకు అంగికరించినట్లు ఉత్తరం వచ్చింది. జోగినాథం సంతోషం చూసి భార్య అలివేలు అప్పుడే విసుక్కోవడం మొదలుపెట్టింది.

'దేనికండి! అంత సంతోషపడిపోతున్నారు' అలివేలు అంటోంది.

'ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి. నీకేం తెల్సు' హుషారులో అనేశాడు. అలివేలుకు కోపం వచ్చింది. జోగినాథం అవేం పట్టించుకునే స్థితిలో లేడు.

ఇంటర్ తరగతి చదివేటప్పుడు కాలేజీ మాగ్జయిన్‌కు కథ రాయడంతో కథా రచయితగా తన పెర్సనాలిటీని చూసుకుని ఫీలవ్వడం మొదలుపెట్టాడు.

పాపం ఆ కథ మాగ్జయిన్‌లో ప్రింటుకాలేదు.

ఆ తరువాత సమయం దొరికినప్పుడల్లా కథ రాయడం దానిని ఏదో ఒక పత్రికకు పంపడం మొదలుపెట్టాడు.

అదేం దురదృష్టమో రాత ప్రతి తిరిగి వచ్చేసేది. కొన్ని పత్రికల వారు సమాధానం ఇచ్చేవారు కాదు.

జోగినాథం చదువులో ఫస్టు. అందుకే ఎక్కడా ఆగకుండా చదువు పూర్తి చేసుకుని ఉద్యోగంలో జేరాడు.

పరపతి ఉంటే కథలు పత్రికల్లో పడతాయని స్నేహితులు అన్నారు.

పత్రికలో పరపతి మీద పడిన కథ పాఠకులు చదివి ఛీకొడతారు. అందుచేత ఆ మాట నిజంకాదని జోగినాథం వాదించేవాడు. జోగినాథానికి కథలంటే ఎంత పిచ్చి అంటే పెళ్లిచూపుల్లో అలివేలును 'మీకు కథలు చదివే అలవాటు ఉందా?' అని అడిగాడు.

ఆమె అదృష్టవశాత్తు 'వీక్లీలో పడ్డ కథలు అప్పుడప్పుడు చదువుతాను' అని చెప్పింది.

పెళ్లయిన కొత్తలో తను రాసిన కథలు అలివేలును చదవమనేవాడు జోగినాథం. మొదట్లో మొగమాటం తర్వాత వీక్లీలో పడ్డ తర్వాత చదువుతాను అని తప్పించుకునేది.

జోగినాథం ఉద్యోగంలో ఆఫీసరుగా ప్రమోట్ అయ్యాడు. కాని అతని కోరిక తీరలేదు. అలా అని సాధన మానలేదు.

జోగినాథం కొడుకు మల్లిక్ కూతురు చంద్రిక తండ్రి కథా రచన పట్ల తేలిక భావం ఏర్పరచుకున్నారు.

తండ్రిలాగే పిల్లలు చదువులో చురుగ్గా ముందుకు వస్తున్నారు.

మల్లిక్ ఎంత తెలివైనవాడంటే ఇంటర్ పాసవ్వగానే ఇంజనీరింగ్‌లో సీటు ఎంట్రెన్స్ పరీక్ష రాసి సంపాదించాడు.

జోగినాథానికి జీవితంలో చాలా కలసి వచ్చాయి. పిల్లలు ముఖ్యంగా ఆరోగ్యవంతులే గాక మంచి ప్రవర్తనగల బుద్ధిమంతులు.

అలివేలుకు భర్త, పిల్లలు ప్రపంచం. వారి సంతోషం తన సంతోషంగా తీసుకుంటుంది.

అయినా జోగినాథానికి ఒకటే దిగులు. అది తన కథ ఏదో ఒక పత్రికలో అచ్చవ్వాలి.

కథలు ఎలా రాస్తున్నారు? కథల పుస్తకాలు చదివి గ్రహించాలని ప్రయత్నించేవాడు.

దినపత్రికలో ఒక ప్రకటన చూశాడు. కొత్తగా వార పత్రిక మొదలుపెడుతున్నట్లుంది. రచయితల దగ్గరనుండి కథలు ఆహ్వానిస్తున్నట్లు చూశాడు జోగినాథం.

కథా వస్తువు ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి కథా గమనం పాఠకుని చేత చదివించేదిగా ఉండాలి. కొత్త రచయితలకు ప్రోత్సాహం యిచ్చే కొత్త పత్రిక.

జోగినాథం ప్రకటన జాగ్రత్తగా చదివాడు. చాలా జాగ్రత్తగా ఆలోచించాడు. ఈ అవకాశం జారవిడుచుకోకూడదు.

పాఠకులు పట్టు వదలకుండా చదివే విషయం ... ఆలోచించాడు. అదే ... అదే ...

అమ్మాయి - అబ్బాయి ప్రేమ కథ.

ఇదిమామూలు కథే కొత్తదనంలేదు.

అత్త - కోడలు కథ యువతరానికి ఎక్కదు.

హాస్య కథ - తనకు చేతగాని విషయం.

ఆలోచించాడు రంగారావు హీరో. పెళ్లయింది. కొత్తగా కాపురం. రుచి మరగిన పులి. రంగారావు భార్య పుట్టింటికి వెళ్లింది. పనిమనిషి కాంతానికి పెళ్లికాలేదు. పెళ్లయితే మొగుడు పొరుగిళ్లకు పనికి పంపించే సాహసం చేయడు.

కాంతం బాగుంటుంది. చాలా బాగుంటుంది. సరదాగా ఉంటుంది. చూస్తేనే హాయిగా ఉంటుంది. కాంతాన్ని కాసేపు తన భార్య స్థానంలో ఉంచితే రంగారావు వల- కాంతం మూగ బాధ-

అదొక శృంగార కావ్యం.

ఆపైన జీవితమంతా మధుమాసం.

జోగినాథం కథ అయిపోయింది.

ఈ కథ తప్పక ప్రచురిస్తారు.

యథాప్రకారం అలివేలు, కథ చదవలేదు. జోగినాథం కథ పోష్టు చేసేసాడు.

'కథ త్వరలో ప్రచురిస్తాం.' ఉత్తరం వచ్చింది. నలభయి నాలుగేళ్ల జోగినాథం యిరవై ఏళ్ల కుర్రాడిలా సంతోషపడి పోతున్నాడు.

విశాఖలో ఇంజనీరింగు చదువుతున్న కొడుకు మల్లిక్‌కు జోగినాథం ఉత్తరం రాశాడు. తన కథ ఫలానా కొత్త పత్రికలో పడుతోందని.

ఉత్తరం చూసిన మల్లిక్ తండ్రి కోరిక తీరుతున్నందుకు చాలా సంతోషించాడు. తన క్లాస్‌మేట్సు గోపి, జేమ్సు రవిలకు చెప్పాడు.

ఈ శుభసందర్భంలో సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. మల్లిక్ ఖర్చంతా భరించాడు. ఆ సరదా అటువంటిది.

రోజులు దొర్లుతున్నాయి. జోగినాథం ఎదురు చూస్తున్న పత్రిక మార్కెట్లో విడుదల కావటంలేదు. ఫ్రండ్స్ మల్లిక్‌ను అడుగుతున్నారు.

ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్లో జోగినాథం కథ గురించి ప్రచురణ జరగకముందే విపరీతమైన ప్రచారం వచ్చేసింది. మల్లిక్ ఈ విషయం తండ్రికి ఉత్తరం రాశాడు.

జోగినాథం చాలా గొప్పగా ఫీలయిపోయాడు. ఉన్నట్టుండి ఒక రోజున మార్కెట్లో కిళ్లీ కొట్టు ప్రక్కన తాడుమీద తాను ఇన్ని రోజులుగా ఎదురు చూసిన పత్రిక వ్రేలాడుతోంది.

తన్మయత్వంతో ముందుకు వెళ్లాడు. ఆతృతగా పత్రిక తిరగేశాడు.

కథ పేరు మార్చాడు.

'ఆట రుచి' - జోగినాథం.

ప్రింటులో ఎంతో బాగుంది. అర్ధనగ్నంగా కాంతం ఆమెతో రంగారావు బొమ్మ పెద్దది గిసి ఉంది.

జోగినాథం దృష్టిలో ఆ బొమ్మ స్థాయి ఎంకి నాయుడుగా ఉంది.

పుస్తకం కొన్నాడు.

అలివేలు చూసింది. పుస్తకంలో కథలు అంతగా బాగాలేవంది. తన కథ పడింది. కాబట్టి అలా అన్పిస్తోందని జోగినాథం భార్యను ఎద్దేవా చేశాడు

మల్లిక్‌కు ఉత్తరం రాశాడు. మల్లిక్ వెంటనే పుస్తకం కొన్నాడు. రవి చదివాడు. గోపీకి చెప్పాడు. గోపి, జేమ్స్ వరుస ఒకరేమిటి హాస్టల్‌లోని వారంతా ఒకరి తరువాత మరొకరు కథ చదివారు.

సీనియర్ స్టూడెంట్సు తరువాత జూనియర్ స్టూడెంట్సు. కథ బాగా సక్సెస్. అందరూ పట్టు వదలకుండా చదివారు. మల్లిక్‌కు చాలా హీరోయిక్‌గా అన్పించింది. తండ్రికి వెంటనే ఉత్తరం రాశాడు.

రెండు రోజులు గడిచింది.

రాత్రి టీ త్రాగి రూంకు వస్తున్నాడు. రవి ఎదురయ్యాడు. రవితో బాటు సీనియర్ స్టూడెంట్ మరొకతను ఉన్నాడు.

రవి పరిచయం చేశాడు. సీనియర్ స్టూడెంట్ పేరు అగ్నిమిత్ర.